ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.5 కనిష్ఠం 16.0
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
శుక్రవారం 26 జనవరి 2024





అభివాదం చేస్తున్న పార్టీ సీనియర్ నేతలు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- ఎంపీ ధర్మపురి అర్వింద్
- బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన దినేష్‌కులాచారి



నిజామాబాద్ అర్బన్, జనవరి 25: సామాన్య కార్యకర్త స్థాయి నుంచి జిల్లా అధ్యక్షుడిగా ఎదిగిన దినేష్ కులాచారి నాయకత్వంలో జిల్లాలో బీజేపీ క్షేత్రస్థాయిలో బలోపేతం అవుతుందని తాను ఆశిస్తున్నానని ఆ దిశగా పనిచేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. గురువారం జిల్లా కార్యాలయంలో నూతన అధ్యక్షుడిగా దినేష్‌కులాచారి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ జిల్లాలో క్లీన్‌స్వీప్ చేస్తుందని రోజురోజుకూ జిల్లాలో పార్టీ బలం పెరుగుతుందన్నారు. పార్టీ ఎదుగుదలలో అందరి భాగస్వామ్యం అవసరమని బూత్‌స్థాయి కార్యకర్త నుంచి జాతీయ స్థాయి నేతల వరకు అందరిని కలుపుకొని పోయి పార్టీని బలోపేతం చేయాలన్నారు. జిల్లా నూతన అధ్యక్షుడు దినేష్ మాట్లాడుతూ.. బీజేపీ క్రమశిక్షణ గల పార్టీ అని తనకు జిల్లా అధ్యక్షుడిగా నియమించడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసి వచ్చే ఎంపీ ఎన్నికల్లో జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో లక్ష చొప్పున ఐదు లక్షల ఓట్లు సాధించేలా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లెగంగారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు బస్వలక్ష్మీనర్సయ్య, వెంకటరమణి, బద్దం లింగారెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి, గద్దె భూమన్న, పంచరెడ్డి లింగం, స్రవంతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్‌వోబీ నిధులను దారి మళ్లించింది..

నిజామాబాద్ రూరల్: రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ)ల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంటే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లించిందని ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన చర్యలపై రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కారు ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలన్నారు. గురువారంజిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో ఆర్‌వోబీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అర్సపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి కోసం కేంద్రం 137.5 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. ఈ ఆర్‌వోబీ పనులను గుత్తేదార్లు సంవత్సరన్నర గడువులోగా పూర్తి నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఈ సంవత్సరం చివరి వరకు పనులు పూర్తికానున్నాయని తెలిపారు. ఆర్‌వోబీల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంటే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లించింద న్నారు. జిల్లాలోని అడవి మామిడిపల్లి వద్ద నిర్మిస్తున్న ఆర్‌వోబీ పనుల కోసం కేంద్రం మంజూరు చేసిన నిధులను సైతం గత కేసీఆర్ ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలన్నారు. ఈ సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త తదితరులు పాల్గొన్నారు.

బకాయిదారులపై కొరడా



నిజామాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో రైస్‌మిల్లుల ధాన్యం బకాయిలపై అధికారులు చర్యలు చేపట్టారు. రైస్‌మిల్లుల్లో జరిగిన కోట్లాది రూపాయల అవకతవకలపై సివిల్ సప్లై అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఇచ్చిన ధాన్యానికి అనుగుణంగా ఎఫ్‌సీఐకి బియ్యం పెట్టని మిల్లులను తనిఖీ చేస్తున్నారు. ఆ మిల్లులపై కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా కస్టం మిల్లింగ్ పెట్టని మిల్లులన్నింటిపై తనిఖీలు చేయడంతో పాటు ఈ నెలాఖరులోపు టార్గెట్ పూర్తి చేసేందుకు పౌరసరఫరాల సంస్థ, పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఆధ్వర్యం లో ఈ తనిఖీలను చేస్తున్నారు. ధాన్యం నిల్వలు లేని మిల్లులపై కేసులు నమోదు చేస్తున్నారు. కొన్ని మిల్లులపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తున్నారు.

- జిల్లాలో బియ్యం బకాయిలు ఇవ్వని మిల్లులపై అధికారుల దాడులు
- బోధన్ డివిజన్ పరిధిలోని మిల్లుల్లో తనిఖీ చేపట్టిన సివిల్ సప్లయిస్ అధికారులు
- ధాన్యం నిల్వలు లేని మిల్లులపై కేసులు నమోదు చేసిన పోలీసులు

ముమ్మరంగా తనిఖీలు

జిల్లాలో రైస్‌మిల్లులకు కేటాయించిన ధాన్యానికి అనుగుణంగా బియ్యం బకాయిలను ఇవ్వని మిల్లులపైన పౌరసరఫరాల సంస్థ, శాఖల ఆధ్వర్యంలో గడిచిన కొన్ని రోజులుగా ముమ్మరంగా తనిఖీలను నిర్వహిస్తున్నారు. ధాన్యం కేటాయింపులకు అనుగుణంగా కస్టం మిల్లింగ్ కింద బియ్యం కేటాయించని మిల్లులపై చర్యలకు ఉపక్రమమిస్తున్నారు. ఏఏ మిల్లులు నిబంధనలకు అనుగుణంగా పెట్టలేదో తనిఖీలు చేస్తున్నారు. ధాన్యాన్ని పరిశీలిస్తున్నారు. నిల్వలు లేని మిల్లులపై కేసులను నమోదు చేస్తున్నారు. ఏఏ మిల్లు ఎంత మొత్తంలో కేటాయింపులు చేశారో దానికి అనుగుణంగా నెలాఖరులోపు కస్టం మిల్లింగ్ కింద ఎఫ్‌సీఐకి బియ్యాన్ని అందించాలని కోరుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఎనిమిది మిల్లుల్లో తనిఖీలు

జిల్లాలో గురువారం వర్ని, నిజామాబాద్ రూరల్, బోధన్ మండలాల పరిధిలోని 8 మిల్లుల్లో తనిఖీలు నిర్వహించారు. ఆ మిల్లుల్లో ధాన్యాన్ని పరిశీలించడంతో పాటు ఎంత మొత్తంలో తేడాలున్నాయో గుర్తించారు. ఆయా మిల్లులపైన కేసులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. వర్ని మండలం పరిధిలోని వర్ని, హుమ్నాపూర్, ఎస్ఎంపురం, నిజామాబాద్ రూరల్ మండలం పరిధిలోని కాలూరు, పోతంగల్ మండలం కారేగామ్ మిల్లుల్లో తనిఖీలను నిర్వహించారు. మిల్లుల్లో ధాన్యాన్ని పరిశీలించారు. దానికి అనుగుణంగా నోటీసులను జారీ చేశారు. జిల్లాలో తనిఖీలు చేసిన మిల్లుల్లో పెద్ద ఎత్తున ధాన్యం లేనట్లు గుర్తించారు. ఈ మిల్లుల్లో లక్షా 10వేల క్వింటాళ్లకు పైగా ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. కొన్ని మిల్లుల్లో ధాన్యం నిలువలు లేకపోవడం, యజమానులు సైతం అందుబాటులో లేకపోవడంతో వారిపై వర్ని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులను చేశారు. ఈ మిల్లులకు సంబంధించి రూ.40 కోట్ల వరకు ధాన్యం లేకపోవడంతో నోటీసులను జారీ చేశారు. ఈ నెలాఖరులోపు మరికొన్ని మిల్లులను తనిఖీ చేయడంతో పాటు అవసరమైతే క్రిమినల్ కేసులను కూడా పెట్టేందుకు సిద్ధమవుతున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి చంద్రప్రకాష్

దాదాబాయి రైస్‌మిల్లుపై దాడులు

రూ.5.40 కోట్ల అవకతవకలు జరిగినట్లు గుర్తించిన అధికారులు

బోధన్ రూరల్, జనవరి 25: పట్టణంలోని దాదాబాయి రైస్‌మిల్‌పై గురువారం సివిల్ సప్లయిస్ అధికారులు దాడులు నిర్వహించారు. రైస్ మిల్‌కు సంబంధించి పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లులో రూ.5 కోట్ల 40 లక్షల మేర అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. రైస్‌మిల్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బోధన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి చంద్రప్రకాష్ మాట్లాడుతూ.. పట్టణంలోని దాదాబాయి రైస్‌మిల్‌కు గతేడు అన్ని సీజన్‌లకు కలిపి 40వేల క్వింటాళ్ల ధాన్యాన్ని ప్రభుత్వం ఇవ్వడం జరిగిందన్నారు. అయితే రైస్‌మిల్ నిర్వాహకులు 17వేల క్వింటాళ్ల వడ్లను బియ్యంగా మార్చి ప్రభుత్వానికి అందించారన్నారు. ఇంకా 22,783 క్వింటాళ్ల ధాన్యం మిల్లులో ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం మిల్లులో ఎలాంటి ధాన్యం లేదన్నారు. వీటి విలువ సుమారు రూ.5 కోట్ల 40 లక్షలుగా ఉంటుందన్నారు. ఈ అవకతవకలను గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చంద్రప్రకాష్ వివరించారు.

తవ్విన కొద్దీ వెలుగు చూస్తున్న బాగోతాలు

బోధన్ డివిజన్ పరిధిలో రైస్‌మిల్లులపై సివిల్ సప్లయిస్ అధికారులు తవ్విన కొద్దీ రైస్‌మిల్లర్ల బాగోతాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. ఇటీవల నవీపేట మండలంలోని అభంగపట్నం గ్రామంలోని రైస్‌మిల్‌పై అధికారులు దాడులు నిర్వహించి రైస్‌మిల్‌ను సీజ్ చేశారు. వర్ని మండలంలోని నాలుగు రైస్‌మిల్లులపై కేసులు నమోదయ్యాయి. గత సీజన్లకు సంబంధించి సీఎంఆర్ ధాన్యాన్ని మిల్లర్లు పక్కదారి పట్టించినట్లు జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు వెల్లడిస్తున్నారు. వర్ని మండలంలోనే 24 కోట్ల విలువ గల ధాన్యాన్ని మిల్లర్లు విక్రయించినట్లు అధికారులు విచారణలో గుర్తించారు. మిల్లర్లు, వ్యాపారుల బ్లాక్ దందాపై సివిల్ సప్లయిస్ అధికారులు గట్టి నిఘా పెట్టి ఒక్కో రైస్‌మిల్లులో జరిగిన అవినీతిని ఒక్కొక్కటిగా వెలికితీస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో అధికారుల విచారణలో కోట్లాది రూపాయల అవినీతి జరిగినట్లు గుర్తించారు. బోధన్ పట్టణంలో పాటు మండలంలోని పలు రైస్‌మిల్లులలో జరిగిన అవినీతిని అధికారులు గుర్తిస్తున్నారు. సివిల్ సప్లయిస్ అధికారుల తనిఖీలతో రైస్‌మిల్లర్ల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

ఓటు హక్కు విలువను గుర్తించాలి



అధికారులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ, సీపీ కల్మేశ్వర్



ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా అధికారులు

- జాతీయ ఓటర్ల దినోత్సవంలో కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, జనవరి 25: ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటుహక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు కావడంతో పాటు ఎన్నికల్లో విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ అధ్యక్ష వహించగా పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ సందేశాన్ని వినిపించారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటామని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాజ్యాంగం ద్వారా ప్రసాదించబడిన ఓటు హక్కు ప్రజాస్వామ్య పరిరక్షణకు పునాదిగా నిలుస్తుందని ఎలాంటి అనుమానాలు లేకుండా ఎన్నికల సంఘం ఎన్నికలను జరిపిస్తుందన్నారు. ప్రతిసారి వినూత్న పద్ధతులను ప్రవేశపెడుతూ ప్రజలలో చైతన్యాన్ని పెంపొందిస్తుందని అందులో భాగంగానే గత ఎన్నికల్లో 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు కల్పించిందన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో నచ్చిన నాయకులను ఓటు ద్వారా ఎన్నుకునే అవకాశం కేవలం ఓటు హక్కు ద్వారానే సాధ్యమవుతుందని ప్రజాస్వామ్య పరిరక్షణలో, మంచి పాలకులను ఎన్నుకోవడంలో ప్రతి ఓటు ఎంతో కీలకమన్నారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఓటరు జాబితాలో పేరు నమోదు కోసం ఏడాది పొడవున వేచి చూసే అవసరం లేకుండా ప్రతి మూడు మాసాలకోసారి సంవత్సరంలో నాలుగు పర్యాయాలు 18 ఏళ్లు నిండిన వెంటనే ఓటరుగా నమోదు అయ్యే అవకాశం ఎన్నికల సంఘం కల్పిస్తుందన్నారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. జాతి, కుల, మత, లింగ, వర్ణ బేధాలు, బడుగు బలహీన వర్గాలు అనే తేడాలు లేకుండా 18 ఏళ్లు దాటిన పౌరులందరికి రాజ్యాంగం ఓటు హక్కును ప్రసాదించిందని ఓటు అనే ఆయుధంతో ఓటర్లు తమకు నచ్చిన వారిని ఎన్నుకునే అవకాశం కల్పించిందని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కొత్తగా నమోదైన యువ ఓటర్లను, ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ సిటీజన్‌లకు జ్ఞాపికలు అందజేశారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చిత్రమిశ్ర, యాదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మకరంద్, నిజామాబాద్ ఆర్‌డీవో రాజేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

జంతు సంక్షేమ పక్షోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

ప్రతి ఒక్కరూ జంతు సంక్షేమం పట్ల అవగాహన పెంపొందించుకొని మూగజీవాల పట్ల జాలి, కరుణ, దయా కలిగి ఉండాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పిలుపునిచ్చారు. జనవరి 14 నుంచి 30 వరకు ప్రతి ఏడాది నిర్వహిస్తున్న జంతు సంక్షేమ పక్షోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను కలెక్టర్, సీపీ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థుల్లో జంతు సంక్షేమం పట్ల అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. విద్యాశాఖ సహకారంతో విద్యార్థులకు జంతు సంక్షేమంపై వ్యాసరచన, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి, అదనపు కలెక్టర్లు, నగర కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.



- పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను చేస్తున్న దృశ్యం

జెండా పండుగకు సర్వం సిద్ధం

- పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నేడు గణతంత్ర వేడుకలు
- ఏర్పాట్లను పూర్తిచేసిన అధికారులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 25: గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం నగరంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. శుక్రవారం నిర్వహించే రిపబ్లిక్‌డే వేడుకల కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శుక్రవారం ఉదయం 9గంటలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ వేడుకలకు ప్రజాప్రతినిధులు, ప్రజలు, అధికారులు, ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేశారు. వేడుకలను వీక్షించేందుకు షామియానాలు, టెంట్లు, కుర్చీలను ఏర్పాట్లు చేశారు. జిల్లా ప్రగతిని తెలిపేలా ఎగ్జిబీషన్ స్టాల్స్, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం విద్యార్థులు రిహార్సల్స్ చేశారు. పోలీసులు కవాతు రిహార్సల్స్ చేశారు.







నికాల్‌పూర్‌లో వాటర్ ట్యాంకు ఇలా..

నీళ్ల ట్యాంకుకు పాకురు

- పట్టించుకోని పంచాయతీ అధికారులు

డొంకేశ్వర్, జనవరి 25: మండలంలోని నికాల్‌పూర్ ప్రధాన రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన మినీ వాటర్ ట్యాంకు పాకురెక్కి దర్శనమిస్తుంది. నిత్యం బోరు నీరు ప్రధాన పైపుల నుంచి ట్యాంకులోకి చేరుతోంది. అయితే నీరు అధికమై ట్యాంకు పై నుంచి కారడంతో పాకురు అధికమవుతోంది. శుభ్రం చేయాల్సిన గ్రామ పంచాయతీ సిబ్బంది అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో తాగునీటికి గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాకురు నీటితో రోగాల బారిన పడుతున్నారు. నెలల తరబడి ట్యాంకును శుభ్రం చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు.

పసుపు ధర పైపైకి

- అత్యధికంగా 10వేల 888 రూపాయలు

ఖిల్లా, జనవరి 25: మార్కెట్ యార్డులో పసుపు ధర రోజురోజుకూ పెరుగుతోంది. గత వారం రోజుల నుంచి ప్రారంభమైన కొత్త పసుపును రైతులు మార్కెట్ యార్డుకు అమ్మకానికి తీసుకువస్తున్నారు. నాణ్యమైన పసుపుకు గతంలో కంటే ఈ యేడాది రూ.10,888 ధర పలికింది. ఈ యేడాది పసుపు దిగుబడులు తగ్గినట్లు భావిస్తున్న వ్యాపారస్తులు సైతం ఎండిన పసుపుకు రైతులు ఆశించినట్లుగా ధరను నిర్ణయిస్తున్నారు. గురువారం మార్కెట్ యార్డుకు కొత్త పసుపు 298 క్వింటాలు రాగా అత్యధికంగా 10,888 ధర పలుకగా, అత్యల్పకంగా ధర 2340 రూపాయలు పలికింది. సరాసరి రూ.9820 ధర పలికింది. అదేవిధంగా రైతులు కొత్త పసుపుతో పాటు నిలువ ఉంచిన పాత పసుపును అమ్మకానికి తరలిస్తున్నారు. గురువారం రైతులు తీసుకొచ్చిన 165 క్వింటాళ్ల పాత పసుపుకు అత్యధికంగా రూ.13279 పలుకగా సరాసరి ధర 11,303 పలికింది. అదేవిధంగా గోళా రకం పసుపుకు 9,711 రూపాయలు పలికింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం మార్కెట్ యార్డులో ధరలు ఆశించిన మేర ఉండటం వల్ల రైతులు నాణ్యమైన పసుపునే తీసుకురావాలని బాగా ఎండబెట్టిన పసుపుకు మాత్రమే మెరుగైన ధర లభిస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది తెలిపారు.



వేంకటేశ్వరస్వామికి ఘనంగా ముత్యాల పల్లకీ సేవ

జక్రాన్‌పల్లి, జనవరి 25 : మండలంలోని తొర్లికొండ గ్రామంలో గల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం రాత్రి ఉంజల పల్లకీసేవ నిర్వహించారు. ప్రతీ నెలలో పౌర్ణమి రోజున ఆలయంలో ఉంజల పల్లకీసేవలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారికి పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. ప్రతీ నెలలో పౌర్ణమి రోజున ఆలయంలో గుంజల పల్లకీసేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


ఉంజల పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

ఆసుపత్రిలో వసతులపై తీర్మానం

రెంజల్, జనవరి 25 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అత్యవసర వసతులపై గురువారం ఆసుపత్రి సలహా కమిటీ ఆధ్వర్యంలో ఎంపీపీ లోలపు రజిని కిషోర్ అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో అవసరాల పనుల కోసం అభివృద్ధి కమిటీ పలు రకాల ప్రతిపాదనలు తయారు చేసింది. అందులో మంజూరైన నిధులను బట్టి అత్యవసర పనుల కొరకు ఖర్చు చేయాలని నిర్ణయించారు. ప్రతీ సంవత్సరం ఆసుపత్రికి లక్ష 50వేల రూపాయలు మంజూరు కాగా ఈ సంవత్సరం 75వేల రూపాయలు మాత్రమే విడుదల అయ్యాయని ఆసుపత్రిలో ఉన్న అవసరాల కోసం మాత్రమే ప్రతిపాదనలు బట్టి అత్యవసర పనుల కోసం ఖర్చు చేపట్టాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మేక విజయ సంతోష్, ఉప వైద్యాధికారిణి విద్య, ఎంపీడీవో శంకర్, వైద్యాధికారి వినయ్‌కుమార్, ఆరోగ్య విస్తీరణ అధికారులు శ్రావణ్‌కుమార్, రవీందర్, అశ్వక్, రాంచందర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార సంఘం మాజీ అధ్యక్షుడికి రిపబ్లిక్ డే వేడుకలకు ఆహ్వానం

ఆర్మూర్‌రూరల్, జనవరి 25 : ఢిల్లీలో శుక్రవారం జరగనున్న రిపబ్లిక్ డే వేడుకలకు హాజరు కావాలని నిజామాబాద్ జిల్లాకు చెందిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మాజీ అధ్యక్షుడు బింగి పెంటయ్యకు ఆహ్వానం అందింది. ప్రతీ రాష్ట్రం నుంచి ఉత్తమ మత్స్యకార కుటుంబాలను రిపబ్లిక్ డే వేడుకలను ఆహ్వానించారని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు సెంట్రల్ ఫిషరీఫ్ బోర్డు వీరికి ఆహ్వానం పంపింది. బింగి పెంటయ్యతో పాటు మరో నలుగురు ఉదయ్ కిరణ్, వంగల రాజు, జనార్ధన్, మోహన్‌కృష్ణలకు ఆహ్వానలు అందినట్లు బింగి పెంటయ్య తెలిపారు. రీపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనేందుకు డిల్లీకి బయలుదేరి వెళ్ళారు.

కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యూలర్ చేయాలి

పెద్దబజార్, జనవరి 25: కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముత్తెన్న, సుధాకర్‌లు అన్నారు. గురువారం నగరంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో ఐఎఫ్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనాలు ఐదు జీవోల గెజిట్ చేయాలని మిగతా 68 షెడ్యూల్ జీవోలు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు సవరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, వెంకన్న, మల్లేష్, కిషన్, మురళి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ

డిచ్‌పల్లి, జనవరి 25: మండలంలోని మిట్టపల్లి గ్రామ ఎంపీటీసీ సభ్యుడు బాలగంగాధర్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీజీగౌడ్ పరామర్శించారు. ఇటీవల ఎంపీటీసీ తల్లి లక్ష్మీ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా వీజీ గౌడ్ మాట్లాడుతూ.. ఎంపీటీసీ బాలగంగాధర్ కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని అన్నారు. ఆయన వెంట సర్పంచ్‌లు తేలు గణేశ్, తిరుపతి, పార్టీ ప్రతినిధులు ఒడ్డం నర్సయ్య, అంకం గంగరత్నం, గొప్ప వెంకన్న, నారాయణ పాల్గొన్నారు.

రూ. 3 కోట్ల 35 లక్షల అభివృద్ధి పనులకు కార్యరూపం దాల్చేనా ?

- నిజాంసాగర్‌లో సెంట్రల్ లైటింగ్, షాదీ ఖానా నిర్మాణాలు కలేనా?
- శంకుస్థాపనలు చేసిన అప్పటి ఎమ్మెల్యే హన్మంత్ షిండే
- అభివృద్ధి పనుల కోసం మండల వాసులు ఎదురు చూపులు



సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం(ఫైల్)

నిజాంసాగర్, జనవరి 25: మండలకేంద్రంలోరూ.3 కోట్ల 35 లక్షలతో మంజూరైన అభివృద్ధి పనులకు కార్యరూపం దాల్చడం లేదని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నాసాగర్ - పిట్లం రహదారి 3/4 నుంచి 3/670 కిలో మీటర్ల పొడవు సెంట్రల్ లైటింగ్ పనులకు ఎస్‌డీఎఫ్ కింద రూ.3కోట్లు మంజూరయ్యాయి.ఈనిధులతో సెంట్రల్ లైటింగ్ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే హన్మంత్ షిండే, జడ్పీ చైర్‌పర్సన్ దఫెదార్ శోభరాజులు శంకుస్థాపనలు చేశారు. రూ. 25 లక్షలతో షాదీఖానాకు శంకుస్థాపన చేయగా, బంజారా కమ్యూనిటీ నిర్మాణానికి రూ.10లక్షలు కేటాయించి శంకుస్థాపనలు చేశారు.సెంట్రల్ లైటింగ్‌కుకాంట్రాక్ట్ పనులు పూర్తి కాగా ఎన్నికల కోడ్‌పడటంతో పనులకు బ్రేక్ పడింది.బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాకపోవడంతో నిరాశకు గురయ్యారు. అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎస్‌డీఎఫ్ నిధుల కింద మంజూరైన అభివృద్ధి పథకం నిర్మాణ పనులు చేపట్టరాదని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. మండల కేంద్రంలో రూ.3కోట్ల 35లక్షల అభివృద్ధి పనులు 2022-23 ఆర్థిక సంవత్సరం క్రితమే పనులు మంజూరు చేశారు. నిజాంసాగర్ పేరు గొప్ప ఊరు దిబ్బ అనే చందంగా ఉండటంతో మండల కేంద్రంలో ఉన్న అన్నాసాగర్ - పిట్లం రహదారి 670 అడుగుల పొడవు రహదారికి సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టేందుకు రోడ్డు భవనాలశాఖ సర్వే కూడా చేసింది. ఈ పనులు త్వరిత గతిన చేపట్టేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషిచేసింది. షాదీఖానా నిర్మాణంచేపట్టాలని అప్పటి జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండేకు మైనార్టీలు కోరగా, రూ. 25 లక్షలతో షాదీఖానా కోసం ఉత్తర్వులు జారీచేసింది. సెప్టెంబరు 25న శంకుస్థాపనలు చేశారు. ఈ పనులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పూర్తయ్యేనా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గానికి రూ. 10 కోట్లు కేటాయించారు తప్ప గత ప్రభుత్వాలు శంకుస్థాపనలు చేసిన పనులకు నిధులు సమకూర్చేరా అని ప్రశ్నార్థకమే. అచ్చంపేట, మర్పల్లి, లింగంపల్లి, బ్రాహ్మణ్ పల్లి బీటీరోడ్డు నిర్మాణాలు ఏళ్ల తరబడి ఎదురు చూసినా గత సెప్టెంబరులో మంజూరు కావడంతో ఈ గ్రామాల ప్రజలు ఎంతో సంతోషంతో ఉన్నప్పటికి వీటి నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి నిలిచిపోయిన అభివృద్ధి పనులను ప్రారంభించేలా చూడాలని కోరుతున్నారు.

హైదరాబాద్‌కు తరలి వెళ్లిన కాంగ్రెస్ నాయకులు

ధర్పల్లి, జనవరి 25: హైదరాబాద్‌లో గల లాల్‌బహదూర్ శాస్త్రీ స్టేడియంలో నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ సభ్యుల సమావేశానికి ధర్పల్లిలోని వివిధ గ్రామాల నుంచి బూత్ కమిటీ సభ్యులు తరలి వెళ్లారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా బూత్ కమిటీ సభ్యులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, శ్రీకాం త్‌రెడ్డి, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి,ఆనంద్,సుదర్శన్,గంగయ్య, జానీ,మధు, తదితరులు ఉన్నారు.

నవీపేట: హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో గురువారం జరిగిన తెలంగాణ కాంగ్రెస్ బూత్ లీడర్స్ కన్వెక్షన్ కార్యక్రమంలో పాల్గొనడానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ మేరకు ప్రత్యేక వాహనంలో కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సంజీవ రెడ్డి, శ్రీనివాస్, రవి, గంగాధర్, జబీర్, తదితరులున్నారు.

మోర్తాడ్: హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో బూత్‌లేవల్ కమిటీ శిక్షణ సమావేశానికి బాల్కొండ నియోజకవర్గం నుంచి 400మంది కార్యకర్తలు ఎనిమిది బస్సులలో బయలుదేరి వెళ్ళారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్‌కార్గె ముఖ్యఅతిథిగా పాల్గొనే సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పాల్గొంటారని నాయకులు తెలిపారు.

ముప్కాల్: హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో బూత్‌లేవల్ కమిటీ శిక్షణ సమావేశానికి గురువారం బాల్కొండ, ముప్కాల్ మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు బయలుదేరి వెళ్ళారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్‌కార్గె ముఖ్యఅతిథిగా పాల్గొనే సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పాల్గొంటారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముప్కాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంద రవి, చిన్నారెడ్డి, పాల్గొన్నారు.



హైదరాబాద్‌కు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు



హైదరాబాద్‌కు తరలివెళ్తున్న కాంగ్రెస్ బూత్ కమిటీ సభ్యులు

డిచ్‌పల్లి: హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో గురువారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ బూత్ లెవల్ సమావేశానికి డిచ్‌పల్లి మండల పార్టీ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో బూత్ లెవల్ నాయకులు తరలివెళ్లారు. కాంగ్రెస్ ను గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేస్తామని ఈ సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గె, సీఎం రేవంత్‌రెడ్డి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డిలు హాజరయ్యారనియ అమృతాపూర్ తెలిపారు. సమావేశానికి తరలిన వారిలో కంచెట్టి గంగాధర్, పొలసాని శ్రీనివాస్, వాసుబాబు, శ్రీనివాస్ గౌడ్, ముల్లంగి నర్సయ్య, రమేశ్ గౌడ్, పెద్దొళ్ల శ్రీను, ధర్మగౌడ్, సాయిరెడ్డి, వెంకటేశ్, నరేందర్ రెడ్డి, పాల్గొన్నారు.

సిరికొండ: గురువారం హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగిన బూత్ లెవల్ కన్వీనర్ల సమావేశానికి సిరికొండ మండలం నుంచి మండల అధ్యక్షులు బాకారం రవి, జిల్లా కార్యదర్శులు ఎర్రన్న, సంతోష్‌ల అధ్వర్యంలో తరలివెళ్లారు.ఎల్‌బీ స్టేడియంలో జరిగిన సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గె ముఖ్య అతిథిగా హాజరైన విషయం పాఠకులకు విదితమే. వీరి వెంట సీనియర్ నాయకులు బాల్‌రాజ్ నాయక్,రైతు విభాగం అధ్యక్షుడు నర్సారెడ్డి, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఆసిఫ్,ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాబురావు, బీసీ సెల్ అధ్యక్షుడు నర్సింగ్ తదితరులు ఉన్నారు.

కోటగిరి: రాష్ట్ర రాజధానిలో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన బూత్ కన్వీనర్ సమావేశానికి గురువారం కోటగిరి, పొతంగల్ మండలాల నుండి కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కోటగిరి, పొతంగల్ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు షాహీద్, వహీద్, ఆనంద్, దత్తు, తదితరులు హైదరాబాద్‌కు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడ్లూరి శ్రీనివాస్

బోధన్ రూరల్, జనవరి 25 : దేశాభివృద్ధిలో యువత పాత్ర చాలా కీలకమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలలో భాగంగా ప్రధానమంత్రి ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నవ ఓటర్లను ఉద్దేశించి మార్గనిర్దేశం చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నో ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడానికి యువత ప్రముఖ పాత్ర వహించాలని కోరారు. వికసిత్ భారత్‌గా చేయాలనే సంకల్పాన్ని తీసుకునే విధంగా పాల్గొన్న యువకులతో ప్రతిజ్ఞ చేయిం చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శ్రీకాంత్, బీజేపీ జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ యోగేష్, బీజేపీ పట్టణ అధ్యక్షులు బాల్‌రాజ్, వెంకటేష్, అరవింద్, రంజిత్, ప్రకాష్, చరణ్‌లతో కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్

ఆర్మూర్‌టౌన్ యువత దేశ ప్రగతి కోసం ముందుండాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు అల్జాపూర్ శ్రీనివాస్, కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దోళ్ల గంగారెడ్డి అన్నారు. గురువారం చేపూర్‌లోని క్షత్రీయ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా యువ సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడుతూ ఓటు హక్కు అనేది ప్రతీఒక్కరి బాధ్యత అని, ఏలాంటి ప్రలోభాలకు లొంగకుండా దేశప్రగతిని దృష్టిలో ఉంచుకొని యువత ఓటు హక్కును వినియోగించుకో వాలని అన్నారు. అవినీతి రహిత దేశం కోసం ప్రధాని మోదీ ఆధ్వర్యంలో శాస్త్ర, సాంకేతి రంగాలలో, వైద్య రంగాలలో దేశ ప్రగతి పథంలో ముందుకు వెళ్తుందని ఆయన నాయకత్వం బలపర్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం ప్రధాని మోదీ వర్చువల్ కార్యక్రమాన్ని ఎల్‌ఈడీ ద్వారా ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి మందుల బాలు, జిల్లా ఉపాధ్యక్షుడు నాగ సురేష్, దినేష్‌రెడ్డి, కలిగోట ప్రశాంత్, నరేష్‌చారి, రాజశేఖర్, నిఖిల్‌కాంత్, తదితరులు పాల్గొన్నారు.

వర్ని మార్కెట్ కమిటీ కార్యదర్శి సస్పెన్షన్

వర్ని,జనవరి25: వర్ని మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు పడింది. మార్కెట్ కమిటీ పరిధిలోని ప్యాడి క్లీనర్‌కు సంబంధించిన 19మోటార్లు అపహరణకు గురి కావడంతో రాష్ట్ర మార్కెట్ కమిటీ కమీషనర్ లక్ష్మీబాయి విచారణ జరిపి ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన కార్యదర్శిపై తక్షణ చర్యలకు ఆదేశించారు. అలాగే మార్కెట్ కమిటీ గోదాంలలో బ్లాక్‌లో ధాన్యం నిల్వలపై ఆమె నివేదిక కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తక్కువ ధరకు కొనుగోలు చేసి టన్నుల కొద్దీ బ్లాక్‌లో ధాన్యం నిల్వల కోసం గోదాంలను వాడుకోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌పై తప్పుడు రికార్డులు సమర్పించి లక్షల్లో బిల్లులు స్వాహా చేశారన్న ఆరోపణలపై ఆమె నివేదిక కోరారు. మార్కెట్ కమిటీలో తరుచూ జరుగుతున్న అక్రమాలపైకిందిస్థాయి సిబ్బంది చేతివాటం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

నేటి నుంచి కమ్మర్‌పల్లిలో రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ టోర్నమెంట్

కమ్మర్‌పల్లి జనవరి 25: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని కేబీఏ ఇండోర్ స్టేడియంలో గురువారం నుంచి రెండు రోజుల పాటు రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్‌అసోషియేషన్ అధ్యక్షుడు ఎండి అహ్మద్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఈ టోర్నమెంట్‌ను ప్రారంభంచనున్నట్లు తెలిపారు. ఈటోర్నమెంట్‌లో డబుల్, సింగిల్ 40ప్లస్ వయసు కేటగిరిలో నిర్వహింపబడుతోందని ఎంట్రీఫీజు రూ.ఆరువందల ఉంటుందన్నారు. టోర్నిలో పాల్గొనే క్రీడాకారులకు భోజన వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల జట్లు మధ్యాహ్నంవరకు చింత తిరుపతి (9440295523), పవన్ (991217929) సంప్రదించాలన్నారు. విజేత జట్లకు ట్రోఫీతో పాటు నగదు ప్రోత్సాహంగా అందజాయబడుతుందన్నారు.

ఎన్‌వైకే జిల్లా అడ్వైజరీ కమిటీ సభ్యునిగా తిరుపతినాయక్

ఆర్మూర్‌టౌన్, జనవరి25: నెహ్రూ యువక కేంద్రం జిల్లా అడ్వైజర్ కమిటీ సభ్యుడిగా గుగులోత్ తిరుపతినాయక్‌ను నియామించారు. కేంద్ర మంత్రి అను రాగ్‌సింగ్ ఠాగుర్ ఆదేశాల మేరకు ఎన్‌వైకెఎస్ డైరెక్టర్ జనరల్ నితిష్‌కుమార్ మిశ్రా గుగులోత్ తిరుపతినాయక్‌ను నియామిస్తూ నియామకపత్రం పంపారు. తనపై నమ్మకంతో బాధ్యతను ఇచ్చిన కేంద్ర మంత్రికి, డైరెక్టర్ జనరల్‌కు సహకరించిన బీజేపీ రాష్ట్ర జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. యువత క్రీడా సామాజిక సేవ కార్య క్రమాలలో తనవంతు కృషి చేస్తానని తిరుపతినాయక్ అన్నారు.

అయోధ్యలో విశోకతీర్థస్వామికి ఘనస్వాగతం

ముప్కాల్, జనవరి25: అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతి ష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని వచ్చిన విశోక తీర్థస్వామికి విశ్వ హిందు పరిషత్ ఆధ్వర్యంలో గురువారం బాల్కొండలో ఘన స్వాగతం పలికారు. బాల్కొండ బైపాస్ నుంచి వన్నెల్(బి) చౌర స్తా వరకు విశోక తీర్థస్వామికి ఘనస్వాగతం పలికారు. ఈ కార్య క్రమంలో బాల్కొండ అయోధ్య తీర్థ కమిటీ సభ్యులు, విశ్వ హిందు పరిషత్ సభ్యులు, భజరంగ్‌దళ్ సభ్యులు, హిందు బంధవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం

బాన్సువాడటౌన్, జనవరి 25: బాన్సువాడ పట్టణంలోని అన్ని ప్రభుత్వ , ప్రైవేటు కార్యాలయాల్లో , వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల్లో శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు అధికారులు , నాయకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. జెండా గద్దెలను , కార్యాలయాలను రంగులతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. జెండాను ఆవిష్కరించేందుకు సిద్ధం చేసి ఉంచారు.

టీజేఎస్ నాయకుల సంబరాలు

కామారెడ్డి టౌన్, జనవరి 25: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియామకమైన టీజేఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంకు శుభాకాంక్షలు తెలుపుతూ కామారెడ్డి జిల్లాకేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో టీజేఎస్ ఆధ్వర్యంలో టపాకాయాలు కాల్చి సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్య క్షుడు లక్ష్మన్‌యాదవ్ మాట్లాడుతూ ఇదితెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవమని అనే కమంది ఉద్యమకారుల పోరాట సమిష్టిఫలితం అన్నారు. తెలంగాణ మలిదశ ఉద్య మపోరాటంలో కీలకంగా వ్యవహరించి తెలంగాణ సాధన కోసం నిరంతరం శ్రమించిన పోరాటయోధుడు కోదండరాం అన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన కోదండరాంకు ఇది సుముచిత గౌరవమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నీలనాగరాజు,జిల్లా నాయకులు పూల్‌సింగ్ రాథోడ్, రాజుయాదవ్, ప్రకాష్,నవీన్‌కుమార్,ఈశ్వర్, ప్రకాష్, అశోక్ పాల్గొన్నారు.



టపాకాయాలు కాలుస్తున్న టీజేఏసీ నాయకులు

పోస్టర్లు ఆవిష్కరణ



మోర్తాడ్‌లో పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న పంచాయతీ వర్కర్స్

మోర్తాడ్, జనవరి25: మోర్తాడ్ మండల కేంద్రంలో గురువారం గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 28 (ఆదివారం) జరిగే తెలంగాణ ప్రగతి శీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రథమ మహాసభ విజయవంతం చేయాలని వారు కోరారు. వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగే ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. పంచాయతీ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో కిషన్, లక్ష్మణ్, మజీద్, చిన్నక్క, రాజేశ్వర్, దుర్గయ్య, నర్సయ్య, గంగారాం,ముత్తెన్న, తదితరులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక



ఎంపికైన క్రీడాకారిణి మహితను అభినందిస్తున్న ప్రిన్సిపల్

డిచ్‌పల్లి, జనవరి 25: జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ధర్మారం(బి) గురుకుల పాఠశాల విద్యార్థిని మహిత ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సంగీత గురువారం తెలిపారు. రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు మహిత ఎంపికైందన్నారు. ఈ నెల 28నుంచి వచ్చే నెల 1వరకు చత్తీస్ ఘడ్ రాష్ట్రంలో కోర్బా జిల్లాలో జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పెడరేషన్ అండర్ -14 లో మహిత పాల్గొంటుదన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ నీరాజరెడ్డి, పీఈటీ జ్యోత్స్న, దమయంతి, లు అభినందించారు.

27న బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం

సుభాష్‌నగర్, జనవరి 25: జిల్లా కేంద్రంలో 27వ తేదీన తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్ష, కార్యదర్శులు పాండు యాదవ్, సిర్నాపల్లి శ్రీహరిలు తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీ వర్గానికి చెందిన బిహార్ మాజీ ముఖ్యమంత్రి కార్పురి ఠాకూర్ శతజయంతి సందర్భంగా భారతరత్న ప్రకటించడాన్ని హర్షిస్తూ కేంద్ర ప్రభుత్వానికి బీసీ కులాల ఐక్యవేదిక కృతజ్ఞత తెలుపుతుందన్నా రు. ఇప్పటికైనా ఠాకూర్‌ను గుర్తించడం సంతోషదాయకమన్నారు. రాష్ట్ర ప్రస్తుత రాజకీయాల్లో బీసీల పాత్ర నామినేటెడ్ పదవులలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సంస్థాగత కార్యక్రమాలు, సంస్థ నిర్మాణం జిల్లా స్థాయి మొదలుకొని గ్రామస్థాయి వరకు కమిటీలు చేయడం, బీసీలకు జరుగుతున్న అన్యాయాలు, నిర్లక్ష్యం,పక్షపాతధోరణి, ఆధిపత్యరాజకీయ పార్టీల వైఖరిపై గ్రామ స్థాయి వరకు ప్రజల్లోకి తీసుకెళ్లడం పై చర్చ ఉంటుందన్నారు.

భగవద్గీత ప్రచార మండలి జిల్లా కార్యవర్గ సభ్యుల ఎన్నిక

బోధన్ రూరల్, జనవరి 25: బోధన్ పట్టణంలోని శ్రీ సాయి బాబా రాధాకృష్ణ మందిరం ఆలయ కమిటీ అధ్యక్షుడిగా కులకర్ణి అశోక్‌రావును నియమించడం జరిగిందని అఖిల భారతీయ భగవద్గీత ప్రచార మండలి సభ్యులు తెలిపారు. అఖిల భారతీయ భగవద్గీత ప్రచార మండలి జిల్లా కార్యవర్గ సభ్యులుగా పబ్బ మురళి, జేపీసీ గోపాల్‌రెడ్డి,మారోజు సుధాకర్ చారి,కులకర్ణి అశోక్‌రావులు నియమితులయ్యారు.

మోర్తాడ్‌లో జాతీయ బాలికల దినోత్సవం

మోర్తాడ్: మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో గురువారం జాతీయ బాలి కల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. డ్రాయింగ్‌లో గెలుపొందిన బాలికలకు మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో అంగన్ వాడి టీచర్‌లు జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మాపూర్‌లో విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

జక్రాన్‌పల్లి, జనవరి25: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు క్రీడా దుస్తువులను మాజీడీసీఎం ఎస్‌చైర్మన్, మునిపల్లి సర్పంచ్ ఎం.సాయిరెడ్డి పంపిణీ చేశారు. దాత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి 42మంది విద్యార్థులకు క్రీడా దుస్తువులను కొనుగోలు చేసి ఈ క్రీడా దుస్తులను విద్యార్థులకు సాయిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి, లక్ష్మాపూర్ సర్పంచ్‌లు ఎం. చిన్న సాయిరెడ్డి, కైలాస్‌నాయక్, ఎంపీటీసీ అను, ఎంఈవో శ్రీనివాస్, మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు ప్రవీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరదకాలువలో పడి వ్యక్తి గల్లంతు

ముప్కాల్, జనవరి25: బాల్కొండ మండలం బోదేపల్లి గ్రామానికి చెందిన గడ్డం సాయన్న(58) అనే వ్యక్తి గురువారం వరదకాలువలో పడి గల్లంతైనట్టు ఎస్సై గోపి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం ఉదయం 11గంటలకు వరదకాలువలో గల తన విద్యుత్‌మోటారు మరమ్మతు చేయడానికి వైర్ పట్టుకొని దిగి మోటారు నుంచి వైర్‌ను తీస్తుండగా వైర్ తెగి వరదకాలులో పడి కొట్టుకుపోయాడన్నారు. గడ్డం సాయన్న ఆచూకికై పరి సర ప్రాంతాల్లో గాలించగా ఆచూకీ లభించలేదు. సాయన్న భార్య లింగు బాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

పద్మశాలి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్),జనవరి25: మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో గురువారం పద్మశాలి సంఘం క్యాలెండర్‌ను మాజీ జడ్పీ చైర్మన్ దఫెదార్ రాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వాజీద్ అలీ, కాశయ్య, ఇఫ్తాకర్, చంద్రశేఖర్, మహేందర్, నారాయణ, ప్రవీణ్, మల్లారెడ్డి, సాయిలు, సాయాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నైట్ ఇండియా టీయూ కోఆర్డినేటర్‌గా రవీందర్‌రెడ్డి

డిచ్‌పల్లి, జనవరి 25: యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఆధ్వర్యంలో ఇగ్నైట్ ఇన్ ఇండియా 2047 విజన్ ఆఫ్ ది డెవలప్‌మెంట్ పేరుతో ఫిబ్రవరి నెలలో వర్సిటీలు కళాశాలలు నిర్వహించబోయే యువ మంథాన్ ఎక్స్‌పర్‌మెంటల్ లెర్నింగ్ కార్యక్రమానికి తెలంగాణ యూనివర్సిటీ కోఆర్డినేటర్ ప్రొ.రవీందర్‌రెడ్డి నియమిస్తునట్లు యూజీసీ సెక్రటరీ దీపాలి జైస్వాల్ గురువారం నియామక ఉత్వర్వులు అందజేశారు. యూజీ, పీజీ విద్యార్థులకు యువ మంథాన్ మోడల్ యూనైటెడ్ నేషన్ పేరుతో నూతన ఆవిష్కరణలు, గ్లోబల్ డిప్లమసీ స్కిల్‌డెవలప్‌మెంట్ భారత ప్రజాస్వామ్య భవిష్యత్ అనే అంశంపై వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని ఉత్వర్వుల్లో పేర్కొన్నారని రవీందర్‌రెడ్డి తెలిపారు. కోఆర్డినేటర్‌గా రవీందర్‌రెడ్డి నియామకం పట్ల రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి, సీనియర్ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

ముప్కాల్, జనవరి25: బాల్కొండ మండల కేంద్రంలోని రెబత్తి రక్షిత్ మూడు నెలల క్రితం పోగొట్టుకోగా గురువారం ఎఎస్సై శంకర్ బాధితునికి అందజేశాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చోరీకి గురైన ఫోన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సీఈఐఆర్ ద్వారా ఫోన్‌ను రికవరీ చేసి ఇవ్వడం జరుగుతుందని అన్నారు.


బోధన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం


పోచంపాడ్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు



ఆర్మూర్‌లో ఓటరు చైతన్య ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

- ఓటు హక్కు చాలా కీలకమని, ప్రతీ ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఆర్డీవో , ఏసీపీ

బోధన్ రూరల్, జనవరి 25: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా కీలకమని, ప్రతీ ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్, ఆర్డీవో రాజాగౌడ్‌లు అన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి అంబేద్కర్ చౌరస్తా కొత్త బస్టాండ్ మీదుగా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటుహక్కును ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని, ఓటు వజ్రాయుధమని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులను ఎన్నుకునే ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ తహసీల్దార్ గంగాధర్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, సీఐలు వీరయ్య, శ్రీనివాసరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వరుణ్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌అర్బన్: జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రోటరీక్లబ్ ఆఫ్ జెమ్స్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ ప్రాజెక్టు చైర్మన్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ కొత్త ఓటర్లను ప్రోత్సహించడం, ఓటు నమోదు సులభతరం చేయడం కోసంఓటరు దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి, రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ సభ్యులు పాల్గొన్నారు.

రుద్రూరు: మండల సమీకృత కార్యాలయంలో గురువారం జాతీయ ఓటరుదినోత్సవాన్ని నిర్వహించారు. అధికారులు ఓటరు ప్రాముఖ్యతను గురించి ప్రజలకు వివరించారు. 18సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకుని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవా లని కోరారు. ఈ సందర్భంగా సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు బాలగంగాధర్, ఐకేపీ, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ఎంపీపీ రజిని కిషోర్, ప్రధానోపాధ్యాయుడు అంజనేయులు విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో విలువైందని సమర్థులైన ప్రజాప్రతినిధులను ఎన్నుకునే బాధ్యత ఓటరుదేనని కాని చాలా మంది ఓటు వేసేందుకు ముందుకు రావడం లేదని అందరు ఓటు వేసేలా ప్రోత్సహించడం కోసం ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు కిషోర్, అరుణ్, గంగాధర్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు తదితరులున్నారు.

సిరికొండ: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా సిరికొండ మండలంలో రెవెన్యూపంచాయతీరాజ్ అధికారులు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించారు. మండల కేంద్రంలో తహసీల్దార్ రవీందర్ రావు ప్రజాస్వామ్య సాంప్రదాయలను స్వేచ్ఛయుత వాతావరణంలో ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిడిలకు లొంగకుండా ఓటేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు గంగారాజం, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి, పొతంగల్ మండలాల్లో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కోటగిరి, పొతంగల్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ప్లకార్డులు ప్రదర్శించారు. బస్టాండ్ ప్రాంగణంలో ఓటు హక్కు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌లు ప్రభాకర్, రమేష్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

మోస్రా: మోస్రా మండలంలోని గోవూర్, చింతకుంట, తిమ్మాపూర్, దుబ్బతండా గ్రామాల్లో అదే విధంగా మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీకాంత్ రావు. ఉప తహసీల్దార్ సాయిలు అధికారులతో కలిసి ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది, జీపీ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: జాతీయ 14వ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల రెవెన్యూ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.ఈకార్యక్రమంలో తహసీల్దార్ ధన్‌వాల్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎస్ఐ, ఆర్ఐ మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలలో తహసీల్దార్ ఉపాధ్యాయులు,విద్యార్థుల తో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈకార్య క్ర మంలో ఆర్ఐ రాజేశ్వర్, సర్వేయర్ కిషన్, హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.

మెండోర: ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకొని దేశ సమగ్రాభివృద్ధిలో భాగస్వాములవుదామని జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం చీఫ్ ఇంజనీర్ రమేష్‌బాబు అన్నారు. గురువారం మండలంలో పోచంపాడ్ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యుత్ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఈ శ్రీనివాస్, డీఈ శ్రీనివాస్ 1104రాష్ట్ర నాయకుడు రిషిక్, శ్రీనివాస్‌రావు, విద్యుత్‌ఉత్పత్తి కేంద్రం ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్: 14వజాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ఓటరు చైతన్య ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజగంగారాం, నాయిబ్ తహసీల్దార్, ఆర్ఐ రిటైర్డు ఉద్యోగులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులంలో జేఎల్ పోస్టుకు దరఖాస్తు

బోధన్‌రూరల్, జనవరి 25: బోధన్ పాండు ఫారంలో గలతెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలి కల జూనియర్ కళాశాలలో ఖాళీగాఉన్న జేఎల్ తెలుగు ఔట్ సోర్సింగ్ పోస్టుకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె. పద్మజ తెలిపారు.అభ్యర్థులు సంబంధిత తెలుగుసబ్జెక్టులో పీజీ, బీఈడీతో పాటు రెండుసంవత్సరాలు అనుభవం కలిగి ఉండాలని తెలిపారు.అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 29వ తేది లోపు తగినసర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలన్నారు.

నూతన చైర్‌పర్సన్ ఎన్నిక తేదీని ప్రకటించాలని కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు విన్నవిస్తున్న ఆర్మూర్ కౌన్సిలర్‌లు

ఆర్మూర్‌రూరల్, జనవరి25: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక తేదీని ప్రకటించాలని కోరుతూ గురు వారం మున్సిపల కౌన్సిలర్‌లు జిల్లా కలెక్టర్‌కు రాజీవ్ గాంధీ హన్మంతుకు వినతిపత్రం అందజేశారు. ఈనెల 4వ తేదీన మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మాణం నెగ్గినందున నూతన చైర్మన్ ఎన్నికకు తేదీని ప్రకటించాలని వారు కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కౌన్సిలర్‌లు లిక్కి శంకర్, ఇట్టెడి నర్సారెడ్డి, ఆకుల రాము, అయ్యప్ప శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఆలూర్‌లో ఘనంగా బీమన్న ఆలయ వార్షికోత్సవం


ఆలూర్‌లో బీమన్నదేవుని గజాలను ఊరేగిస్తున్న భక్తులు

ఆర్మూర్‌రూరల్, జనవరి25: ఆలూర్ మండల కేంద్రంలో గురువారం బీమన్నదేవుని 37వ ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివాసి నాయకులు ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని వివిధ వీధుల గుండా బీమన్న దేవుని గదాలను ఊరేగించారు. భజన కార్యక్రమాలు, భక్తి పాటలతో మహిళలు మంగళ హారతులతో వెంట రాగా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కల్లెం మోహన్, ఉపసర్పంచ్ దుమ్మజి శ్రీనివాస్, డాక్టర్ అరుణ్, ఆదివాసి నాయకపోడు సంఘం అధ్యక్షుడు కొండపురం నవీన్, ప్రధానకార్యదర్శి ముత్తెన్న, ఉపాధ్యక్షుడు నాగేశ్వర్, మల్లయ్య, భూమన్న, విజయ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

హంగర్గలో ఆయుర్వేద వైద్య శిబిరం

కోటగిరి,జనవరి 25: పొతంగల్ మండలంలోని హంగర్గ గ్రామంలో గురువారం ఆయుష్ ఆధ్వర్యంలో ఆయుర్వేది వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ ప్రేమలత పలువురికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా వాత రోగ, చర్మ సంబంధ వ్యాధులకు, అర్శ రోగ, స్త్రీ సంబంధ సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, ఆయుష్ ఫార్మాసిస్టు పురుషోత్తం, ఏఎన్ఎంలు సుభాషిణీ, విజయ, ఆశా కార్యకర్తలు రేఖ, సమత, సునీత, మమత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

బోధన్‌రూరల్,జనవరి 25:బోధన్ పట్టణంలోనిఆచన్‌పల్లికి చెందినసోఫియన్ అనే తొమ్మిదవతరగతి విద్యార్థిఅదృశ్యమ య్యాడని పట్టణ సీఐవీరయ్య తెలిపారు.మంగళవారం అదృశ్యమైన విద్యార్థి తండ్రిఉమర్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నా మన్నారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నా మని ఆయన తెలిపారు.త్వరలో తల్లిదండ్రులకు అప్పజెప్తామన్నారు

గణతంత్ర వేడుకలకు సిరికొండ విద్యార్థి ఎంపిక


హెచ్‌ఎంతో విద్యార్థి ముఖేష్

సిరికొండ జనవరి 25 : శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో జరిగే గణతంత్ర్య దినోతవ్స పరేడ్ వేడుకలకు సిరికొండ మండల కేంద్రానికి చెందిన విద్యార్థి జి.ముఖేష్ ఎంపిక య్యారు. గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కల్పన ముఖేష్‌ను అభినందించారు. ఆయన ఢిల్లీ వెళ్లి పోయారని కల్పన చెప్పారు. మా పాఠశాకు చెందిన విద్యార్థి పరేడ్‌కు ఎంపిక కావడం మాకు ఎంతో ఎంతోషంగా ఉందన్నారు.

పీజీ పరీక్షలకు 96మంది గైర్హాజరు


టీయూలో పీజీ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆడిట్‌సెల్ డైరెక్టర్

డిచ్‌పల్లి, జనవరి 25: తెలంగాణ యూనివర్సిటీల్లో పీజీ 3,5,7,9వ సెమిస్టర్ పరీక్షలకు 96మంది విద్యార్థులు గురువారం గైర్హాజరయ్యారని సీవోఈ ప్రొ.అరుణ తెలిపారు. వర్సిటీ కళాశాల లా కళాశాల ,సౌత్ క్యాంపస్, ప్రభుత్వ గిరిరాజ్ కళాశాల, ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కామారెడ్డి, బాన్సువాడ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పరీక్షలు జరుగుతున్నాయని టీయూ కళాశాల పరీక్ష కేంద్రాన్ని ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు. ఉదయం జరిగిన పరీక్షలకు 1709 విద్యార్థులకు గాను 1613 మంది హాజరయ్యారని, 96మంది గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం జరిగినపరీక్షలకు 181మంది విద్యార్థులకుగాను 180 మంది పరీక్షలకు హాజరయ్యారని,డైరెక్టర్‌చంద్రశేఖర్ తెలిపారు.

వృద్ధురాలి నుంచి బంగారం అపహరణ

ఖిల్లా, జనవరి 25: నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కంఠేశ్వర్ ప్రాంతంలో ఓ వృద్ధురాలిని ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మాయమాటలు చెప్పి ఆమె వద్ద గల బంగారు, వెండి ఆభరణాలను అపహరించినట్లు మూడో టౌన్ ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. నగరానికి చెందిన చంద్రవ్వ అనే వృద్ధురాలు తేనెసాయిబాబా ఆలయానికి వెళ్లి వస్తుండగా దగ్గరలోని చర్చి వద్ద ఇద్దరు ఆమెను పలుకరించి చర్చిలో బహుమతులు ఇస్తున్నారని మాతో రావాలని ఆమెతో మాయమాటలు చెప్పి నమ్మించి ఆమెను చర్చి కంపౌండ్‌లోకి తీసుకెళ్లారు. అక్కడ ఆమెతో నీ మెడలో ఉన్న బంగారం, వెండి ఆభరణాలు ఉంటే ఇవ్వరని నమ్మించి వాటిని ఒక సంచిలో వేయించారు. కొద్దిసేపటి తర్వాత ఆమెకు అనుమానం రాకుండా ఆమె వద్ద నుంచి ఆ సంచిని అపహరించి వస్తామని చెప్పి వెళ్లిపోయారు. ఎంతసేపటికి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు రాకపోయేసరికి బాధితురాలు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని చర్చి సమీపంలో గల సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

పాన్ షాపులో గంజాయి అమ్మకాలు

- 550 గ్రాముల గంజాయి స్వాధీనం .. ఒకరి అరెస్టు


పట్టుబడ్డ గంజాయి అమ్ముతున్న వ్యక్తితో పోలీసులు

సుభాష్‌నగర్, జనవరి 25: పాన్ షాపులో గంజాయి అమ్ముతున్న ఒకరిని అరెస్టు చేసి వ్యక్తి వద్ద నుంచి 550 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ విలాస్ తెలిపారు. గురువారం ఉదయం నమ్మదగిన సమాచారం మేరకు నగరంలోని గుర్బాబాది రోడ్‌లోని ఖోరికమల్ సింగ్ పాన్‌షాపులో తనిఖీలు చేయగా 550 గ్రాముల ఎండు గంజాయి దొరికిందన్నారు. అక్రమంగా కలిగి ఉండి గంజాయి విక్రయిస్తున్న కారణంగా కమల్‌సింగ్‌ను అరెస్టు చేసి నిజామాబాద్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై గంగాధర్, సిబ్బంది సలీమ్, చంద్రమోహన్, సాగర్‌రావు, గోపి, కార్తిక్, కిరణ్‌కుమార్, నీలిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా గ్రామసభ

మోస్రా,జనవరి25: మోస్రా మండలంలోని దుబ్బతండా, గోవూర్, మోస్రా గ్రామాలలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి, చేయాల్సిన పనుల విషయాలు, పూర్తి కాని పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు నరేందర్ రెడ్డి, మేని బాయి, సుమలత రాంరెడ్డి, ఉప సర్పంచ్ సుదర్శన్ గౌడ్, పంచాయతీ కార్యదర్శులు ముతీబ్, ప్రేమ్ కుమార్, మహేశ్వరి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.135	రూ.205	రూ. 225
వెన్‌కాబ్(కిలో)	రూ.140	రూ.210	రూ. 230

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,100	రూ.59,100	రూ.755

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : ఫైటర్ (హిందీ 3డీ) (8.40, 12.15, 3.50, 7.25, 11.00)
స్ర్కీన్-2 : హనుమాన్ (తెలుగు) (12.00, 3.20, 6.40, 10.00)
స్ర్కీన్-3 : గుంటూరుకారం (3.40, 10.10)
: నా సామిరంగ (7.00)
స్ర్కీన్-4 : అయాలాన్ (తెలుగు) (12.50, 7.20)
: కెప్టెన్ మిల్లర్ (4.10, 10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : కెప్టెన్ మిల్లర్ (10.30)
: హనుమాన్ (1.20, 4.25, 7.30, 10.30)
స్ర్కీన్-2 : అయాలాన్ (తెలుగు) (10.30, 4.30, 10.30)
: గుంటూరుకారం (1.30, 7.30)
స్ర్కీన్-3 : ఫైటర్ (హిందీ 3డీ) (10.20, 4.25, 10.35)
: కెప్టెన్ మిల్లర్ (1.30, 7.40)

దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : గుంటూరుకారం (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : ఫైటర్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కెప్టెన్ మిల్లర్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్